

జిల్లాలో స్వల్పంగా వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 25 : జిల్లాలో అక్కడక్కడా స్వల్పంగా వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 45.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్ష పాతం 4 మి.మీ నమోదైంది. పోలవరంలో 35.6, బుట్టాయిగూడెంలో 14.6, జంగారెడ్డిగూడెంలో 9.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 5 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతాలు నమోదు అయ్యాయి.

మధ్యంతర భృతి ప్రకటించాలి

-7లో

» జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల డిమాండ్

జయహో వందేభారత్

ఏలూరులో హాల్ట్.. ప్రారంభించిన మంత్రి కొలుసు, ఎంపీ పుట్టా



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు, ఎంపీ మహేశ్, ఎమ్మెల్యేలు

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : వందేభారత్ రైలుకు ఏలూరులో హాల్ట్ ఆదివారం నుంచి మొదలైంది. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ హాల్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రైలుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి రైలును ప్రారం భించారు. వైజాగ్ వైపు నుంచి సాయంత్రం 5.54 నిము షాలకు ఏలూరుకు వచ్చి 5.55 నిముషాలకు విజయ వాడ వైపు బయల్దేరి వెళ్ళాల్సి ఉంది. అయితే ఆదివారం సాయంత్రం 6.08 నిముషాలకు రాగా ప్రారం భోత్సవాన్ని పూర్తి చేసుకుని 6.17 నిముషాలకు విజయవాడ వైపు వెళ్లింది. ఈ సందర్భంగా ఎంపీ మహేశ్ యాదవ్ మాట్లాడుతూ వందే భారత్‌కు ఏలూరులో హాల్ట్ ఉండడంతో జిల్లా ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఏలూరులో స్టాప్ ఇచ్చినందుకు ప్రధాన మంత్రి మోదీకి, కేంద్ర రైల్వే మంత్రికి, రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పగటి వేళ ఈ రైలు ప్రయాణం కొనసాగడం వల్ల అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు మాట్లాడుతూ జిల్లాలో వ్యాపారులకు, ఉద్యోగస్తులకు ఈ రైలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్‌కుమార్, చింతమనేని ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, అదనపు డివిజనల్ మేనేజర్ టీఈ ఎడ్విన్, సీనియర్ డీఈఈ టి.సురేష్, సీనియర్ డీవోఎం సత్యస్వరూప్, సీనియర్ డీఎస్టీఈ ఎండీ ఆలీఖాన్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఏలూరు నగరపాలక కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్, స్టేషన్ మేనేజర్ రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మహేశ్ కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రైలు ఎక్కి విజయవాడ వరకు తమ అనుచరులతో ప్రయాణించారు. రైలులో ఉన్న సౌకర్యాలను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు.

ఇంటింటికీ వైద్య పరీక్షలు

» సీతారామనగరంలో వైద్య శిబిరం ఏర్పాటు
» 73 మందికి వైద్య పరీక్షలు.. 13 మంది జ్వరపీడితుల గుర్తింపు



వైద్యశిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్



జ్వరంతో బాధపడుతున్న తండ్రీకూతురు కొమ్ము భూషణం, నాగపావని

కుక్కునూరు, ఆగస్టు 25 : సీతారామనగరంలో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలకు వైద్య సిబ్బంది స్పందించారు. ఆదివారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరం, ఒళ్ళు నొప్పులు, కాళ్లనొప్పులు, తదితర జబ్బులతో బాధపడుతున్న 73 మంది వైద్యశిబిరానికి రాగా వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 13 మంది జ్వరాలతో ఉన్నట్లు గుర్తించామని ఐటీడీఏ కేఆర్‌పురం డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేష్ కుమార్ తెలిపారు. పలువురికి డెంగీ పరీక్షలు నిర్వహించగా నెగిటీవ్ రిపోర్టు వచ్చిందన్నారు. చికున్‌గున్యా పరీక్షల నిమిత్తం బ్లడ్‌శాంపిల్స్‌ను ఏలూరు పంపించినట్టు తెలిపారు. కాగా గ్రామంలో ఒకే ఇంట్లో ముగ్గురి నుంచి ఐదుగురు వరకు జ్వరాలతో ఉన్నారు. మంచాల మీదే నీరసంతో పడి ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ జ్వరంతో ఉన్న వారికి వెంటనే వైద్య సాయం అందిస్తున్నారు. గ్రామంలో ప్రజలు తాగుతున్న బోరు, బావినీటిని మోటార్ ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరీక్షల నిమిత్తం నీటి నమూనాలను ఏలూరులోని ల్యాబ్‌కు పంపించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతు న్నారు. అమరవరం వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనంత్ రోగులకు వైద్యపరీక్షలు చేశారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేవరకు మెడికల్ క్యాంప్ కొనసాగి స్తామని వైద్యులు తెలిపారు.



కేఆర్ పురంలోని జిల్లా మలేరియా కార్యాలయం

ఏం జరిగింది..?

» గుట్టు చప్పుడు కాకుండా ఏడాది కిందట ఏలూరుకు మలేరియా కేంద్రం తరలింపు
» ఏజెన్సీలో మలేరియా కేసులు.. ఉద్యోగులు జిల్లా కేంద్రంలో విధులు
» కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు
» కార్యాలయాన్ని తిరిగి కేఆర్‌పురం తరలించాలని గిరిజనుల డిమాండ్

బుట్టాయగూడెం, ఆగస్టు 25 : రోగాలు ఇక్కడ... ఆస్పత్రి అక్కడ అన్న విధంగా ఉంది జిల్లా మలేరియా కార్యాలయం తీరు. రోగాలు ఉన్నచోట కాకుండా కొందరి ఉద్యోగులు తమ స్వార్థం కోసం కార్యాలయం ఏజెన్సీకి రాకుండా అడ్డుపడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి తరలించడంతో మందులకు, ఇతర వాటికి ఏలూరు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దోమల మందు మలాథియాన్ తప్పా మిగిలిన వాటిని జిల్లా నుంచి తెచ్చుకోవాల్సిందే. దీంతో సకాలంలో వైద్యం, సేవలు అందడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఆదివాసీలు, గిరిజన సంఘాలు, ఎమ్మెల్యే మలేరియా కార్యా లయాన్ని ఏజెన్సీకి తరలించాలని పట్టుబడుతున్నా ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

జిల్లా మలేరియా కార్యాలయం చాన్నాళ్ల కిందట జిల్లా కేంద్రంలోనే ఉండేది. మలేరియా కేసులు ఏజెన్సీ లోనే అధికంగా నమోదయ్యేవి. అధికారులు, సిబ్బంది ఏలూరులో ఉండి కేసులు నమోదు అయినప్పుడు వచ్చి వైద్యసేవలు అందించి వెళుతుండేవారు. ఈక్రమంలో సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిం చేవి. మారుమూల ప్రాంతాలకు వైద్యసేవలు అందేవికావు. మలేరియా మరణాలపై సీరియస్ అయిన ప్రభుత్వాలు కారణాలను తెలపాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించడంతో మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న ఏజెన్సీలోనే జిల్లా మలేరియా కార్యాలయాన్ని ఉండడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని నివేదిక ఇవ్వడంతో జిల్లా కేంద్రంలో ఉన్న కార్యాలయాన్ని ఐటీడీఏ కేంద్రంగా కేఆర్‌పురం తరలించారు. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ మలేరియా నివారణ చర్యలు చేపడుతుండడంతో ఏటా నమోదయ్యే వందల సంఖ్యలో కేసులు, పదుల సంఖ్యలో మరణాలు తగ్గుముఖం పట్టాయి.

గుట్టుచప్పుడు కాకుండా తరలింపు

కారణాలు తెలియదు కాని ఏజెన్సీ కేంద్రంగా పనిచేసిన మలేరియా కార్యాలయాన్ని ఏడాది కిందట మరలా జిల్లా కేంద్రానికి తరలించారు. కార్యాలయం తరలింపు సమయంలో ఐటీడీఏలో పీవో పోస్టు ఖాళీగా ఉంది. ఏజెన్సీ ప్రాంతానికి రావడానికి ఇష్టంలేని కొంతమంది సిబ్బంది జిల్లా కేంద్రంలో ఉండాల్సిన జిల్లా కార్యాలయం ఏజెన్సీలో ఉండటమేంటీ అనే వితండవాదం చేస్తూ కార్యాలయం మార్పుకు శ్రీకారం చుట్టారనేది గిరిజనుల వాదన. అదే సమయంలో ఇన్‌చార్జీల పాలన కార్యాలయం తరలింపునకు కలిసివచ్చింది. కార్యాలయం తరలిపోయిందని తెలుసుకున్న అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వెనక్కి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

మలేరియా కేసులు ఏజెన్సీలో అధికంగా నమోదవుతుంటే అధికారులు, సిబ్బంది ఏలూరులో విధులు నిర్వహిస్తూ కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మలేరియా కార్యాలయాన్ని ఏజెన్సీకి తరలించాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఐటీడీఏ అధికారులతో మొదటి సమావేశంలోనే మలేరియా కార్యాలయం విషయాన్ని అప్పటి పీవో ఎం.సూర్యతేజ దృష్టికి తేగా కమిషనర్‌కు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఏజెన్సీకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తర్వాత ఆయన బదిలీపై వెళ్లిపోయారు. జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి దృష్టికి మలేరియా కార్యాలయం తరలింపు విషయాన్ని ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ఈనెల 9న ఐటీడీఏ కేంద్రంగా జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లోను మలేరియా కార్యాలయాన్ని ఏలూరు నుంచి ఏజెన్సీకి తరలించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యాలయం తరలిరాక పోవడానికి మోకాలడ్డుతున్నవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీ కేంద్రంగా కార్యాలయం పనిచేసేలా అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

స్థానికోత్సాహం!



కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో కుదురుకుంటున్న స్థానిక సంస్థలు

» గ్రామసభలతో సర్పంచ్‌ల్లో కొత్త హుషారు
» పంచాయతీరాజ్‌లో క్రమేపీ తొలగుతున్న నిరాశ, నిర్వేదం
» పవన్ చొరవ పట్ల పల్లెల్లోను మద్దతు
» ఇక ఈసారి జిల్లా పరిషత్ వంతు
» త్వరలోనే జడ్పీకి సకల మోక్షాలకు అవకాశం
» మునిసిపాలిటీల్లోను ఇప్పటికే కొత్తదనం

గడిచిన ఐదేళ్లపాటు వ్యవస్థలన్నీ నిర్వీర్యం. స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల హక్కులను కాలరాయడంలో వైసీపీ ఎక్కడలేని ఉత్సాహం చూపింది. ఊరికే రాజు అయిన సర్పంచ్‌ని అన్ని కార్యక్రమాలకు దూరం చేసింది. జడ్పీటీసీలు, ఎంపీటీసీల పరిస్థితి ఇదే. మునిసిపల్, కార్పొరేషన్‌లలో కొంత పాలన సాగినా నిధులు నిల్. కూటమి ప్రభుత్వం రెండు నెలల్లోనే స్థానిక సంస్థలకు తిరిగి కొత్త శోభ సంతరించుకునేలా రంగం సిద్ధం చేస్తోంది. కొన్నింటిని ఇప్పటికే రంగంలోకి తెచ్చింది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

గతమంతా.. చేదే..

స్థానిక సంస్థలన్నీ గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టేశారు. సమాంతరంగా గ్రామ, వార్డు సచివాలయాలను తెచ్చి వలంటీర్లకు పెత్తనం అప్పగించారు. 13, 14 ఆర్థిక సంఘం నిధులను నేరుగా పక్కదారి పట్టించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వందల కోట్లు దారి మళ్ళాయి. సర్పంచ్‌లు, స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన మిగతా ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని నిలిపివేశారు. ఇంకో విచిత్రం ఏమిటంటే వైసీపీ పాలనలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగ్గా అత్యధికులు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ఆ పార్టీ అనుకూలురే ఎక్కువ సంఖ్యలో విజయం సాధించారు. తీరా అధికారంలోకి వచ్చాకా ఏమీ చేయలేకపోతున్నామన్న నిస్పృహలో వారంతా కుంగిపోయారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఏకంగా సర్పంచ్‌లతో తలపడే స్థాయికి ఎదిగారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యేలు ఎవరూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పంచాయతీరాజ్ వ్యవస్థపై ఆ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇన్నాళ్ళు సర్పంచ్ అంటే గుర్తులేని గ్రామాలకు తాజాగా జరిగిన ఉపాధి హామీ గ్రామ సభలన్నీ సర్పంచ్ అధ్యక్షతనే జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు లోపే ప్రణాళికలు రూపొందించుకోవడానికి, అదీ ప్రజల సమక్షంలోనే నిర్ణయించడం ప్రత్యేకించి రూ.230 కోట్ల వ్యయంతో ఒక్క ఏలూరు జిల్లాలోనే ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవడం తాము ఊహించని పరిణామంగా కొందరు సర్పంచ్‌లు వ్యాఖ్యానిస్తున్నారు. 'పవన్ విజన్ ఉన్న నాయకుడు. గ్రామ సీమలు ఒక వెలుగు వెలుగొందాలని ఆయన ఆశిస్తున్నారు. ఆ రూపంలోనే మమ్మల్ని మరింత మమేకం చేశారు. ప్రజలను కలుపుకుపోతున్నారు. ఇది శుభపరిణామం' అంటూ సర్పంచ్‌లు కొందరు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారుల్లోను కదలిక వచ్చి గ్రామస్థాయిలో ఏవేమి చేయాలో ఇప్పటికిప్పుడు పథక రచన చేయడం శుభపరిణామంగానే భావిస్తున్నారు. పల్లెల్లో పట్టు కోసం జల జీవన్ మిషన్ దగ్గర నుంచి ఇతరత్ర కార్యక్రమాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టబోతున్నారు. ఇప్పటికే ఆర్థిక సంఘం నుంచి మరొకసారి నిధులు విడుదలైన తరుణంలో ఈసారి ఈ నిధులను వైసీపీ హయాంలోలా పక్కదారి పట్టించకుండా గ్రామాల అభివృద్ధికే వినియోగించబోతున్నారు.

ఈసారి జిల్లా పరిషత్ వ్యవహారం..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలను విభజించింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగి ఉన్నాయి. ఈ క్రమంలోనే జిల్లా పరిషత్ ఇంతకు ముందు మాదిరి కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. ఒక్క పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించాలంటే మూడు జిల్లాల కలెక్టర్లు హాజరుకావాల్సి ఉంది. వీరితోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరుకావాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో ఒకరిద్దరు వచ్చినా కేవలం కొంత సమయం మాత్రమే గడిపి నిష్క్రమించారు. ఆఖరుకి అప్పటి ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం యంత్రాంగంలో గందరగోళం సృష్టించింది. ఒకప్పుడు పంచాయతీ రాజ్‌లో కీలక భూమిక పోషించే జిల్లా పరిషత్ సైతం బలహీనపడింది. మూడు నెలలకోసారి జరిగే జడ్పీ సమావేశాలు తూతూ మంత్రంగా సాగాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో ఉండే జిల్లా పరిషత్ తమది కాదన్నట్టు మిగతా జిల్లాల ప్రజాప్రతినిధులు అనేక సమావేశాలకు గత ప్రభుత్వంలో డుమ్మా కొట్టారు. అటు పశ్చిమగోదావరి జిల్లా, ఇటు ఏలూరు జిల్లాలో ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న ఆళ్ల నాని, కొట్టు సత్యనారాయణ సైతం జిల్లా పరిషత్‌కు ఒక రూపు తేలేకపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కటంటే ఒక్కటి కూడా మచ్చుకైనా గుర్తుండేలా అభివృద్ధి పని జరగనేలేదు. మండల పరిషత్‌లు సైతం బలహీన పడ్డాయి. దీనికంతటికి కారణం నిధులలేమి, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు. అటు జిల్లా పరిషత్‌లో వైసీపీ అనుకూలురే అత్యధికంగా గెలుపొందడం తెలుగుదేశం భాగస్వామ్యం కేవలం ఒక్క శాతం లోపే ఉండడం మరో పరిణామం. ఇలాంటి తరుణంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నందున అదే స్థాయిలో జిల్లా పరిషత్ కార్యకలాపాలను త్వరలోనే ఒక గాడిన పట్టడానికి కూటమి ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. పార్టీల వారీగా బలాబలాలను పక్కనపెట్టి క్షేత్రస్థాయిలో ప్రజా సర్వీసులను మరింత వేగవంతం చేయాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది.

మునిసిపల్, కార్పొరేషన్‌లోను కొత్త దనం

జిల్లా వ్యాప్తంగా ఉన్న మునిసిపల్, కార్పొరేషన్ రెండింటిలోను పాలనా వ్యవహారాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చకచకా పాలనా వ్యవహారాలను చక్కదిద్దుతున్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడ అధికారులను మార్చారు. తాజాగా వారంలోపు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిల్లోను పెద్ద ఎత్తున బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే ఏలూరు మునిసిపల్ కమిషనర్‌ను మార్చారు. నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో త్వరలోనే ప్రక్షాళన జరగబోతుంది. గడిచిన ఐదేళ్లల్లో వీటన్నింటిలోనూ జరిగిన అవకతవకలన్నింటి పైనా దృష్టి పెడుతున్నారు. ఏలూరు కార్పొరేషన్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ పాలనలోనే కీలక నిర్ణయం తీసుకోగా వైసీపీ హయాంలో భ్రష్టుపట్టింది. ఇప్పుడు మరోసారి కూటమి అధికారంలోకి రావడంతో ఇక నగరాన్ని తీర్చిదిద్దడంతోపాటు నూజివీడు మునిసిపాలిటీ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి నగర పంచాయతీలను చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తానని అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. నగరవాసులు శభాష్ అనే టట్టుగా అన్ని నగరాలు, పట్టణాల్లోను మొక్కలు పెంచి తీరుతామని ఆ మేరకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంకోవైపు పట్టణ, నగరవాసుల్లో చైతన్యం నింపేందుకు ఆన్‌లైన్ పద్ధతిలోనే పన్ను చెల్లింపులను వేగవంతం చేస్తున్నారు. ఇలా ఒక్కొక్కటిగా స్థానిక సంస్థల్లో పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

ఖరీఫ్ సా..గుతోంది!

» జిల్లాలో వరి విస్తీర్ణం 2,33,739 ఎకరాలు
» ఇప్పటివరకు నాట్లు వేసింది లక్షా 60 వేల ఎకరాలు
» ఆగస్టులో వర్షాలు అంతంతే
» గతేడాది ఇదే సమయానికి 85 శాతం నాట్లు పూర్తి
» దిక్కుతోచని రైతాంగం



ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి వద్ద సాగునీరు లేక బీటలు వారిన వరి పొలం

ఏలూరు సిటీ, ఆగస్టు 25 : ఖరీఫ్ సా..గుతోంది.. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు కొంత అనుకూలంగానే కనిపించినా ఆగస్టు వచ్చేసరికి మందగించాయి. ఖరీఫ్ సాగులో వరి నాట్లు ఇంకా పూర్తి కాలేదు. జూలైలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఎర్రకాలువ, తమ్మిలేరు, గోదావరికి వరదలు రావడంతో వరి నారుమళ్ళు, వరి నాట్లు వేసిన పంటపొలాలు రోజుల పాటు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. తిరిగి వరినాట్లు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టులో సాధారణంగా ఎక్కువ శాతం వర్షాలు కురియాల్సి ఉంది. అయితే ఆ దిశగా వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగులో కష్టాలు మొదలయ్యాయి. అడపా దడపా వర్షాలు పడుతున్నా మెట్ట ప్రాంతాల్లో సాగుకు ఏమాత్రం దోహద పడే పరిస్థితి లేదు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,33,739 ఎకరాలు సాధారణ వరి విస్తీర్ణం కాగా ఇంతవరకు లక్షా 60 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తైనట్టు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి సాగు తక్కువగానే జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో వస్తున్న మార్పులే కారణమని చెబుతున్నారు.

తీరు మారిన నైరుతి

నైరుతి రుతుపవనాల తీరు మారడంతో ప్రస్తుతం జిల్లాలో వర్షపు మేఘాలు ఉన్నా ఎండతీవ్రత, ఉక్కబోత ఎక్కువగానే కనిపిస్తోంది. సాధారణంగా శ్రావణమాసంలో వర్షం ముసురు కొన్ని రోజుల పాటు కొనసాగాల్సి ఉంది. ప్రస్తుతం వాతావరణం విభిన్నంగా ఉండడం కారణంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయి. జిల్లాలో 27 మండలాలుండగా కొన్ని ప్రాంతాల్లో కురిస్తే భారీగా వర్షాలు, లేని పక్షంలో తీవ్రంగా ఎండతీవ్రత కొనసాగుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. కాని ఆ దిశగా వర్షాలు కురవాల్సిన పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు.

వాతావరణంలో మార్పులు

గత రెండున్నర నెలల కాలాన్ని పరికించి చూస్తే వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. వర్షాలకు భూమి, ఆకాశం, సముద్రాలు సహకరించాలి. అంటే మూడింటి మధ్య ఏర్పడే తేడాల ప్రభావంతో వర్షాలు కురియాలి. కానీ ఈ మూడూ వేడెక్కడంతో సమతుల్యత తప్పింది. నైరుతి సీజన్‌లో బంగాళా ఖాతంలో సగటున ప్రతి వారం ఒక అల్పపీడనం ఏర్పడాలి. సీజన్ మొత్తంలో ఆరేడు వాయుగుండాలు రావాలి కానీ ఈ సారి పరిస్థితి లేకపోవడంతో వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. ఈనెలాఖరులోగా అయినా విస్తారంగా వర్షాలు కురిస్తే కొంత గట్టెక్కే పరిస్థితులు ఉంటాయి.

లక్షా 60 వేల ఎకరాల్లోనే నాట్లు

జిల్లాలో సార్వా సాగు సజావుగా సాగడం లేదు. జిల్లాలో ఈ సార్వా సీజన్‌లో 2,33,739 ఎకరాల్లో సార్వా సాగు జరగాల్సి ఉంది. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ నుంచి అందిన నివేదికల ప్రకారం జిల్లాలో లక్షా 60 వేల ఎకరాల్లోనే నాట్లు పూర్తయినట్టు చెబుతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో లక్షా 80 వేలకు పైగా ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సార్వా ధాన్యం దిగుబడులపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

సాగు నీరు అందడం లేదు

వర్షాభావ పరిస్థితుల వల్ల ఇటు కృష్ణా, గోదావరి డెల్టాలోని శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయి. పంట కాల్వలు, కృష్ణా గోదావరి ప్రధాన కాల్వలు పూడుకుపోవడంతో నీటి పారుదల తక్కువగా ఉండి సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలైనా ఇంకా నాట్లు పూర్తి కాలేదు.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పొలాలు ఎండిపోతున్నాయి..

ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి పెట్టాను. వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో గత 15 రోజులుగా సాగునీరు అందని పరిస్థితి. దీంతో పంట భూములు బీటలు వారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

- వి.రామారావు, రైతు, మాదేపల్లి

హాస్టళ్లలో డైట్ చార్జీల పెండింగ్ బిల్లులపై కదలిక

» ప్రభుత్వానికి అధికారుల నివేదిక

ముదినేపల్లి, ఆగస్టు 25 : ప్రభుత్వ బీసీ సంక్షేమ, సాంఘిక శాఖ వసతిగృహాల్లో విద్యార్థులకు డైట్ చార్జీల చెల్లింపులకు ఆయా శాఖల్లో కదలిక వచ్చింది. నెలల తరబడి ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులకు త్వరలోనే మోక్షం కలుగనుంది. డైట్ చార్జీలు రాక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీ సర్లు విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించేందుకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై 'సార్..రూ.2వేలు సర్దండి' శీర్షికన ఈనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు స్పందించి ఈ విషయాన్ని ఆయా శాఖ డైరెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వసతి గృహాల నిర్వహణలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పడుతున్న పాట్లు, అప్పుల పాలవుతున్న తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, రాష్ట్ర హెచ్‌డబ్ల్యూవోల సంఘ నాయ కులు కూడా అధికారులతో చర్చించిన నేపథ్యంలో ప్రభుత్వ స్థాయిలో కదలిక వచ్చింది. బీసీ సంక్షేమ హాస్టళ్లకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎస్సీ సంక్షేమ హాస్టళ్లకు 2023 అక్టోబరు నుంచి డైట్ చార్జీల బిల్లు లు పెండింగ్‌లో ఉన్నట్టు జిల్లా అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించారు. దీంతో బిల్లుల చెల్లింపునకు బడ్జెట్ మంజూరు కోసం ఆయా శాఖల మంత్రులతో ఉన్నతాధికారులు చర్చించినట్టు తెలిసింది. ఈ నెలాఖరుకు వసతి గృహాల డైట్ చార్జీల పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్టు జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

త్వరలోనే వంద పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తాం : మంత్రి నిమ్మల



రోగులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఆగస్టు, 25 : పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం సందర్శించారు. వార్డులలో పర్యటించి రోగులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాటాడారు. బాలింతల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులను, సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణపనులను తొందరగా పూర్తి చేయాలనీ, ఈలోపుగా కొత్త భవనంలో ఎమెర్జెన్సీగా నాలుగు వార్డులను పూర్తిచేసి ఇవ్వాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ వార్డుల్లోకి ఇన్ పేషెంట్లను తరలించి వైద్య సేవలందించాలని మంత్రి నిమ్మల వైద్యులకు సూచించారు. ఆస్పతి చుట్టూ మొక్కల నాటాల న్నారు. అనంతరం మంత్రి నిమ్మల విలేకర్లతో మాట్లాడుతూ వంద పడకల ఆస్పత్రి భవనాన్ని త్వరి తగతిన పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన భవన నిర్మాణం జగన్ రావడంతో ఐదేళ్లలో కూడా పూర్తికాని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ గిరి, డీఈ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఒ.రవి కుమార్, వైద్యులు అనిత, సుధీర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవీ, కృష్ణా జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి భిక్షగాడు మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదవుట పల్లి రైల్వే పోలీస్ స్టేషన్ దగ్గరలో విజయవాడ ఇంచిపేట రామ్‌గోపాల్‌సత్రం వీధిన కు చెందిన ఈభూది నాగరాజు (48)కి వివాహం కాలేదు. 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ ప్రతిరోజు రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి, కాకినాడ, తిరుపతి రైళ్లట భిక్షాటన చేస్తూ జీవిస్తాడు. తనతోటి అంధుడైన బొమ్మిని గుర్రప్పతో కలిసి రత్నాచల్ జనరల్ భోగీ ఎక్కి భిక్షాటన చేస్తున్నారు. పెద్దవుటపల్లి వద్ద ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందాడు. ఈసమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

ఉండి ఆగస్టు 25: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి వారం రోజులు తరువాత ఇంటికి దగ్గరలో ఉన్న పంట బోదెలో మృతదేహం కనిపించడంతో అనుమానా స్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు ఉండి పోలీసులు ఆదివారం తెలిపారు. ఉండి మండలం పాందువ్వ గ్రామ శివారు ఖండ్రికకు చెందిన పసుపులేటి ప్రభాకరరావు (40) మతి స్థిమితం లేక పోవడంతో ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని భార్య సీతామహాలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి బంధు వులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఎటువంటి ఆచూకీ లభిం చలేదు. ఆదివారం ఉదయం గ్రామంలోని దగ్గరలో ఉన్న పంట కాలువలో ప్రభాకరరావు మృతదేహం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు దానిని గమనించి సీతామహాలక్ష్మీకి సమాచారం అందించారు. ఈ మృతిపై సీతామహాలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ నజీరుల్లా తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న భగ్న ప్రేమికుడు



చిర్రా వెంకీ (ఫైల్)

పెనుమంట్ర, ఆగస్టు 25 : ఓ భగ్న ప్రేమికుడు ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెను మంట్ర పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి పెను మంట్ర మండలం పాలమూరు అరుంధతి పేటకు చెందిన చిర్ర నరేష్ కుమారుడు చిర్రా వెంకీ (19) తండ్రి మరణిం చడంతో చిన్నాన్న సంరక్షణలో ఉన్నాడు. తల్లి జీవనో పాధి నిమిత్తం గల్ఫ్ దేశాలు వెళ్ళింది. మొగల్తూరు మండలం కాళీ పట్టణానికి చెందిన యువతిని కొంతకాలంగా వెంకీ ప్రేమిస్తున్నాడు. ఇరువురు పెద్దలు ప్రేమికులు మైనర్ల కావడంతో మేజర్లు అయ్యే వరకు వేరువేరుగా ఉండా లని నిర్ణయించారు. నెల క్రితమే ఇరువురు మేజర్లయ్యారు. కొద్ది రోజుల్లోనే పెళ్లి చేసుకోవాలని భావించారని ఇంతలోనే యువతికి పెళ్లి కుదిరిందని తెలియడం తో ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు రోదిస్తున్నారు. ఈ సంఘటనపై మృతుడి నాయనమ్మ సువార్త పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుగొండ ఇన్‌చార్జి ఎస్ఐ కుప్పిసెట్టి గంగాధర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : మనవడిని కొడుతున్నారని అడ్డు వెళ్లిన తాతను కొ ట్టి ఆపై మోటార్ సైకిల్‌తో ఢీకొనడంతో తీవ్రగాయాలు పాలై ఏలూరు ప్రభుత్వా స్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వడ్డెర గూడెంకి చెందిన వేముల బోడి బాబు (75) మనవడిని అదే ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తి పది రోజుల క్రితం కొడుతుం డగా బోడు బాబు అడ్డు వెళ్ళాడు. అతనిని కూడా కొట్టారు. అంతే కాకుండా శ్రీను సోదరుడు ధనరాజు మోటార్ సైకిల్‌తో అతివేగంగా వచ్చి బోడు బాబును ఢీకొ న్నాడు. దీంతో తీవ్రగాయాల పాలైన బోడు బాబుని ఒక్క ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పి ంచారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు ఈ ఘర్షణ ఘటనపై ఇంతకుముందే వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయ గా ఇపుడు హత్య కేసుగా మార్పు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమి త్తం ఆస్పత్రి మార్చురికి తరలించారు.

ఆలమూరులో చోరీ

పెనుమంట్ర, ఆగస్టు 25 : మండలంలోని ఆలమూరులో ద్వారంపూడి వెంకటరెడ్డి పక్క పోర్షన్‌లో కొడుకు అనారోగ్యంతో ఉన్నాడని ఇంటికి తాళం వేసి తోడుగా పడుకున్నారు. ఉదయం వచ్చిన వెంకటరెడ్డికి తన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలో ఐదు కాసులు బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరణకు గురైందని పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ చోరీకి పాల్పడిన ప్రాంతాల్లో వేలి ముద్రలు సేకరించారు. ఇంటి తలుపు బద్దలు కొట్టి ఈ చోరీకి పాల్పడినట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు పెనుమంట్ర ఇన్‌చార్జి ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 25 : ఓ ప్రేమ పెళ్ళి వ్యవహారంలో యువతి బంధువులు మైసన్నగూడెంలో శనివారం మంద పాటి రాజు, అతని తల్లి, మేనత్తపై చేసిన దాడి ఘటనలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. అరెస్టయిన వారిలో పారేపల్లి నరేంద్ర, పారేపల్లి నాగార్జున, బల్లే విజయ్‌కుమార్, కొప్పుల శ్రీను, మనికే నాగేశ్వరరావు, చిట్టిబోయిన జగదీష్, సాకిరి వెంకన్న ఉన్నట్లు ఆయన తెలి పారు. వీరిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు పంపను న్నట్లు ఎస్సై చెప్పారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

» రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి » బహుళ సంఘాల్లో సభ్యత్వాలను ప్రభుత్వమే రద్దు చేయాలి » జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు అర్బన్, ఆగస్టు 25 : ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణమే మధ్యంతర భృతి(ఐఆర్)ని ప్రభుత్వం ప్రకటించాలని ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరులో జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం జరిగాయి. ఈ రెండు కార్యవర్గ సమావేశాలకు రాష్ట్రంలోని 26 జిల్లాల జేఏసీ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడుతూ అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులు డిమాండ్ చేయాల్సిన పరిస్థితులు రాకుండానే ఎనిమిది అంశాల్లో సానుకూల నిర్ణయాలను ప్రకటి ంచి, అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వేతన సవరణపై గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్ట కుండానే రాజీనామా చేసినందున, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కమిషనర్‌ను నియమించి నిర్ణీత కాల వ్యవధిలోగా నివేదికను రప్పించుకుని నూతన పీఆర్సీని అమలుచేసేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

వాస్తవానికి గతేడాది జూలై ఒకటి నుంచే 12వ పీఆర్సీ వేతన స్కేళ్ళు, జూన్ ఒకటి నుంచి ఐఆర్ అమలుకావాల్సి ఉందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పెన్షనర్లకు చెల్లిస్తున్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ శ్లాబులను గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా తగ్గించి వేసిందని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే పాత శ్లాబుల ప్రకారం పెన్షనర్లకు అదనపు పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి కేవలం వైద్య ఆరోగ్య శాఖలో కొందరికే పరిమితం చేసిందని, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న విద్యాశాఖ వంటి కీలకమైన శాఖలకు కూడా క్రమబద్ధీకరణను వర్తింప జేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తొలగించిన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం వర్తింప జేయాలన్నారు.

బహుళ సంఘాల్లో సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఒక ఉద్యోగి ఒక సంఘంలో మాత్రమే సభ్యత్వం కలిగి ఉండేలా 'రోసా' నియమనిబంధనల్లో మార్పులు చేసి, బహుళ సభ్యత్వాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆయా శాఖల్లో సమస్యలపై పూర్తి అవగాహనతో వ్యవహరించే డిపార్ట్‌మెంట్ సంఘాల నిర్ణయాలకు ఇతర సంఘాలు భిన్నంగా వ్యవహరించే వీలుందని, ముఖ్యం గా కామన్ కేడర్ సంఘాల జోక్యం వల్ల ప్రధానమైన అంశాల్లో అనవసర మైన భిన్నాభిప్రాయాలకు దారితీసే అవకాశముందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం, ఇటీవల రూపాంతరం చెంది కొత్త ఏపీ ఎన్జీవోలుగా మార్చుకుని అన్ని శాఖల్లో గెజిటెడ్ అధికారులకు కూడా సభ్యత్వం తీసుకోమని ఎన్జీవోలు గెజిటెడ్ అధికారులను కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఈ నేపథ్యంలో ఏపీజేఏసీ-అమరావతి అనుబంధ సంఘాల్లో సభ్యత్వం ఉన్న సభ్యులెవరూ ఏపీఎన్జీవో, ఏపీజీఈఏ లాంటి కామన్ కేటగిరీ లేదా ఇతర ఏ సంఘాల సభ్యత్వాన్ని తీసుకోరాదని రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానిం చామని వెల్లడించారు. అనంతరం జేఏసీ రాష్ట్ర కోశాధికారిగా పనిచేసిన మురళీకృష్ణ నాయుడు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనను సన్మానించారు. ఆయన స్థానంలో కొత్తగా సంఘ కోశాధికారిగా కనపర్తి సంగీతరావు, కో చైర్మన్లుగా జె.శ్రీనివాస రావు, డీజే ప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శిగా కె.ఆంజనే యకుమార్‌లను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కో చైర్మన్లు రమణ, శాస్త్రి, శివానందరెడ్డి, కిషోర్‌కుమార్, స్టేట్ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ పి.లక్ష్మి, సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి, జిల్లా జేఏసీ చైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉల్లి కిలో రూ.60

కాస్త పెరిగిన చికెన్



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25: ఉల్లిపాయలు అరవైకి చేరి సామా న్యులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. కర్నూలు ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్ కి తక్కువగా వస్తుండటం, మహారాష్ట్ర ఉల్లి గిరాకీగా ఉండటంతో ఉల్లిరేట్ల కు కళ్లెం వేసేందుకు అవకాశం లేకపోయింది. దీంతో ఉల్లి ధర ఆకాశాన్నం టింది. రానున్న రోజుల్లో కర్నూలు ఉల్లిపైనే తాడేపల్లిగూడెం మార్కెట్ ఆశలు పెట్టుకుంది. వాటితోపాటు బీర రూ.40, వంకాయ 60-80, చిక్కుల్లు నాటు 100, హైబ్రీడ్ 60, బంగాళ దుంపలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, టమాట రూ.20, అల్లం రూ.150, బెండ రూ.20 దొండ రూ.20, క్యారెట్ రూ.40, దోస రూ.30, కాకర రూ.40, ఆనబ రూ.20, కొత్తిమీర కట్ట రూ.40 పలుకుతోంది. చికెన్ ధరలు గతంతో పోల్చుకుంటే కాస్త పెరిగాయి. గత వారం రూ.180 పలికిన చికెన్ ఈ వారం రూ.220కి విక్రయించారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కావడంతో డీలా పడిన చికెన్ మార్కెట్‌కు ఊరట లభించింది.

ఒకనికి కత్తిపోట్లు

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : ఏలూరు రూరల్ మండలం సుం కర వారి తోటకు చెందిన సర్కస్ చేసుకునే భవాని చంటితో అదే ప్రాంతానికి చెందిన వారి బంధువులు ఆదివారం రాత్రి గొడవకు దిగారు. ఈ గొడవలో భవాని ఏసు, భవాని బాలు, సఖి అనే ముగ్గురు కలిసి కత్తితో చంటిని పొడిచారు. దీంతో తీవ్ర గాయా లపాలైన చంటిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరు గైన చికిత్స నిమిత్తం వైద్యులు విజయవాడకు రిఫర్ చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిస్సింగ్ కేసు నమోదు



ఎస్.దావీదు (ఫైల్)

కాళ్ళ, ఆగస్టు 25 : భర్త కనిపించడం లే దంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సి ంగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ళ పోలీ సులు ఆదివారం తెలిపారు. కాళ్ళ మండలం మేకల దిబ్బకి చెందిన ఎస్.దావీదు శనివారం భీమవరం వెళ్ళి వస్తానని తిరిగి ఇప్పటి వర కు ఇంటికి రాకపోవడంతో భార్య మరియ మ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.శ్రీని వాసరావు కేసు నమోదు చేసినట్లు తెలిపా రు. ఫోటోలో వ్యక్తి కనిపిస్తే 94407 96649 సమాచారం ఇవ్వాలని కోరారు.

పరామర్శ

ఏలూరు క్రైం, ఆగస్టు 25 : ద్వారకాతిరుమల మండలం మద్ది వారిపల్లెకు చెందిన మద్దిరావమ్మపై బంధువులే చేతబడి చేస్తుం దని అనుమానంతో ఆమెను కొట్టి పళ్ళు పీకేశారు. ప్రస్తుతం ఏ లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెను ఆదివారం రాత్రి మూఢ నమ్మకాల నిర్మూలన సంఘ జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ పరామర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు.

జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి



ఎన్.దుర్గలహరి

ఆకివీడు రూరల్ ఆగస్టు 25 : ఆకివీడులోని పీఎల్ఎస్ జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నిడుమోలు దుర్గలహరి(15) జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం దుంపగడప గ్రామానికి చెందిన ఇటుక బట్టీలలో పనిచేసే నిడుమోలు రాఘరావు, నాగలక్ష్మీ కుమార్తె శనివారం ఉదయం చలి జ్వరంతో ఆకివీడు సీహెచ్‌సీలో జాయిన్ అయ్యిందని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాత్రి సమయంలో వాంతులు విరోచన లు అవుతుండంతో, సిబ్బంది ఇంజక్షన్లు ఇచ్చిన తరువాత శరీరం చల్లబడిపోయి నోటి నుంచి నురుగువ చ్చిందని పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళమని వైద్య సిబ్బంది చెప్పడంతో తీసుకెళుతుండగా పెద్ద విరోచనం అయ్యిందని, మార్గమధ్యలోని ఆకివీడులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారన్నారు. ఇదిలా ఉండగా బాలిక తండ్రి, తమ్ముడు జ్వరంతో బాధప డుతున్నా రని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆప్రాంతంలో విషాదఛా యలు అలుము కున్నా యి. అందరితో కలివిడిగాఉండే బాలిక మృతి చెందడం తో తోటి విద్యార్థులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. వైద్య సిబ్బంది తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుంది.

ప్రాణాపాయ స్థితిలో సచివాలయ ఉద్యోగి



ఏలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భోగరాజు

ఆకివీడు మండలం సిద్ధాపురం సచివాలయంలో ఇంజనీ రింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బోగరాజు జ్వరంతో ప్రభుత్వాస్పత్రి (యూపీ హెచ్‌సీ)లో జాయిన్ అయ్యారు. తరువాత ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోగా ప్లేట్‌లెట్లు 44 వేలకు తగ్గిపోవడంతో సీహెచ్‌సీలో చేరారు. అక్కడి నుంచి 108లో శనివారం రాత్రి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అక్కడ వైద్య సిబ్బంది పట్టించుకోక పోవడంతో ప్రైవేటుగా రక్త పరీక్షలు చేయించడంతో ప్లేట్‌లెట్లు 20 వేలకు పడిపోయాయని తెలిపారు. ఈ విషయం ఆస్పత్రి సిబ్బందికి తెలిపినా ఎటువంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఏలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందజేస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉందని, ఆదివారం రాత్రికి నాలుగు యూనిట్లు ప్లేట్‌లెట్లు ఎక్కించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా వైద్య సిబ్బంది తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబరు 22 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

నరసాపురం, ఆగస్టు 25: స్వాతంత్ర్య పోరా టంలో బ్రిటిష్‌వారిపై పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధం తిని పురస్కరించుకుని సెప్టెంబరు 22, 23, 24 తేదీల్లో నరసాపురంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బలరాం తెలిపారు. పట్టణంలోని మీరా గ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్లూరి పుట్టి న, చదివిన జిల్లాలో ఈ మహాసభల్ని నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ మహాసభలకు కేంద్ర కమిటీ సభ్యులు రాఘువులుతో పాటు రాష్ట్ర నాయకులు మధు, గఫూర్ వంటి ముఖ్య నేత లంతా హాజరవుతారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తామన్నారు. వాటితో పాటు విభజన చట్టం లోని హామీలు, గత ప్రభుత్వం ప్రజలపై మోపిన పన్నుల బారం, రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలు, నిరుద్యోగం, విద్యార్థుల సమ స్యలపై కూడా చర్చిస్తామన్నారు. కె.పెద్దిరాజు, జి.రామ్మోహన్, ఎం.త్రిమూ ర్తులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ అద్నాన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఆగష్టు 25 : క్రీడాకారులకు గెలుపోటములు సహజ మని, క్రీడా స్ఫూర్తితో ముం దుకు సాగాలనీ జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మీ అన్నారు. భీమవరం అంగర విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో గత ముడు రోజులుగా జరుగుతున్న మెంటే సుబ్బారావు నాగరత్నం మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ అండర్ 17 బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిసాయి. భీమవరం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. విజేతలకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు , రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి. రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అండర్ 17 బాయ్స్ సింగిల్స్ టీ లక్ష్మి స్వేతాన్, బాలికల సిగిల్స్‌లో హాసనశ్రీ, అండర్ 17 బాయ్స్ డబు ల్స్‌లో చరణ్‌రామ్, హరికృష్ణ, అండర్ 17 బాలికల డబుల్స్‌లో హాసన శ్రీ, చౌదరీలు విజేతలుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్‌లో సాయి సాహిల్, స్ఫూర్తిలు విజయం సాధించారని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారు సెప్టెంబరులో హర్యానాలో జరిగే నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చీఫ్ కోచ్ అంగర వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, గనిరెడ్డి త్రినాధ్, ఐజాక్ బాబు, మెంటే వంశీ, కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.

1న అండర్ 14 బాలుర జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 25: పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియే షన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటిన ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశా లలో అండర్ -14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఆదిత్యవర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వ్యక్తిగత క్రికెట్ కిట్‌తో ఆ రోజు ఉదయం 9 గంటలకి హాజ రుకావాలన్నారు. క్రీడాకారులు 2010, సెప్టెంబరు ఒకటి తరువాత జన్మిం చి ఉండాలన్నారు. ఆధార్, బోన్‌ఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు తీసుకురా వాలన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక చేస్తు న్నట్లు కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు తెలిపారు. మరింత సమాచా రానికి 94910 44848లో సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

విహార యాత్రకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



పి.చందు(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 25 : స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన పెదతాడేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు (49) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. పెదతాడేపల్లి ఎంపీటీసీగా, ఉప సర్పంచ్ గా పనిచేసిన ఆయన ప్రస్తుత పంచాయతీ పాలకవర్గ సభ్యుడి గా పని చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా గ్రామంలో టీడీపీ పట్టు సాధించేందుకు ఆయన అవిరళ కృషి చేశారు. నియోజకవర్గంలోనే కిలక నేతగా ఉన్న చందు మరణాన్ని కూటమి నాయకులు విస్మయం చెందారు. చందు మృతదేహం స్వదేశం తరలిరావడానికి ఖజకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసి అధికారులతో మంత్రి నారా లోకేష్ మాట్లాడి త్వరగా రప్పించే ఏర్పాట్లు చేస్తున్నా రు. ఆయన మృతికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ, వాడపల్లి వెంకట సుబ్బరాజు తదితరులు సంతాపం తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి సుస్తీ

» అరకొర సిబ్బంది » పని చేయని రక్త పరీక్షల యంత్రం
» అవస్థలు పడుతున్న కార్మికులు

కాయ కష్టం చేసుకుంటూ... ప్రైవేటు సంస్థల్లో కార్మికులుగా పని చేసే వారు అనారోగ్యం బారిన పడితే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆస్పత్రికి సుస్తీ చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఈఎస్ఐకి వస్తే ఇక్కడన్నీ సమస్యలే.. ఎందుకొచ్చామా అనేలా తయారైంది తణుకులోని ఈఎస్ఐ ఆస్పత్రి. ఇక్కడ రోగులకు సేవలందిం చేందుకు సరిపడ సిబ్బంది లేరు... రక్త పరీక్షలు చేసే యాంత్రాలు పని చేయవు.. కనీసం పరీక్షించేందుకు వైద్యులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండరు. దీంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి రిఫర్ చేయడం పరిపాటిగా మారిపోయింది.



తణుకులోని ఈఎస్ఐ డిస్పెన్సరీ, మూలనపడ్డ రక్తపరీక్షల యంత్రం (ఇన్‌సెట్)

తణుకు, ఆగస్టు 25 : సూమారు ఎనిమిది వేల పైబడి కార్మికులకు వైద్య సేవలు అందించే తణుకు ఈఎస్ఐ డిస్పెన్సరీకి 14 మంది సిబ్బంది ఉండాలి. ఏడుగురు మాత్రమే ఉన్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒక వైద్యుడుని కాంట్రాక్టు పద్ధతిలో నియమిం చారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు సార్లు వస్తుంటారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. మిగిలిన పోస్టులు ఎప్పటికి భర్తీ అవుతాయో తెలియని పరిస్థితి. డిస్పెన్సరీకి వచ్చే కార్మికులకు ఒక్క బీపీ మిషన్ మాత్రమే అందు బాటులో ఉంది. రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసే ఎలాంటి మిషన్ లు లేవు. రక్త పరీక్షలు చేసే ఎనలైజర్ యంత్రం మూలనపడింది. రక్త పరీక్షలు చేసే కిట్లు అందుబాటులో లేవు. షుగర్, రక్తపరీక్షలు ఆరు నెలల క్రితం నుంచి ఆగిపోయాయి. దీంతో ప్రతి నెల కనీసం 50 కేసులు రాజమండ్రికి పంపుతుంటారు. మరి అత్యవసరం అయితే విజయవాడకు రిఫర్ చేస్తుంటారు. ఇక మందుల సంగతి సరేసరి. ఒకసారి ఇచ్చిన మందులు మరలా రావడం లేదని కార్మికులు చెబుతున్నారు. దీని వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన మందులు ఎప్పుడు వేసుకోవాలో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు. మందుల మీద స్టికర్లు అంటిస్తే అవగాహన ఉంటుందని అంటున్నారు. అయితే గైనకాలజిస్టు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆస్పత్రి సమయం మార్చాలి



కరోనా సమయంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడుకు ఆస్పత్రి సమయం మార్చారు. దీని వలన కార్మికులకు వైద్య సేవలు పూర్తిగా అందడం లేదు. అంతకు ముందున్న సమయం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, మరలా సాయంత్రం నాలుగు నుంచి ఆరు వరకు ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

గైనకాలజిస్టుని నియమించాలి



డిస్పెన్సరీలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గైనకాలజిస్టుని నియ మించాలి. వారం రోజులు మించి సెలవులు ఇక్కడ ఇవ్వరు. ఆపైన సెలవులు కావాలంటే రాజమహే ంద్రవరం వెళ్ళాల్సి ఉంటుంది. దీనివల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలి.

- గుబ్బల గోపి, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి



స్థానికులతో మాట్లాడుతున్న నూతన కమిషనర్ భానుప్రతాప్

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు : కమిషనర్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 25: నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ పారిశుధ్యంపై దృష్టి సారించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామునే నగరమంతా కలియదిరిగి పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు హెల్త్ అధికారికి సూచనలు ఇచ్చారు. వెహికల్ డిపోను సందర్శించిన చెత్త సేకరణ ట్రాక్టర్లు, చెత్త తరలింపు వివరాలు అడిగి తెలుసు కున్నారు. పోణంగిలో డంపింగ్ యార్డును పరిశీలించారు. వెంకటాపురం నాగేంద్రకాలనీ, చెంచుకాలనీల్లో డ్రైన్లలో పూడికతీతను పరిశీలించారు. ప్రజలకు అందించే తాగు నీరును ఎలా పరీక్షలు నిర్వహిస్తున్నారో పరిశీలించారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి



విద్యార్థినులను పరామర్శిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

బుట్టాయగూడెం, ఆగస్టు 25: వైరల్ జ్వరాలతో సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బూసరాజుపల్లి గురుకులం విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బన్నె వినోద్ విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆదివారం ఆయన పరామర్శించారు. విద్యార్థినులకు వైరల్ జ్వరాలు వచ్చాయని ముందుగానే తెలిసినా రక్తపరీక్షలు చేయించడం, తల్లిదండ్రులకు తెలియపరచడంలో గురుకులం యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తెల్లం కార్తీక్, మొట్టుం సిద్ధు, ఇరపా కార్తీక్, తుర్రం సందీప్, గురుగుంట్ల లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు వీహెచ్‌పీ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఏలూరు రూరల్, ఆగస్టు 25: ధర్మ పరిరక్షణక వీహెచ్‌పీ కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ అన్నారు. వీహెచ్‌పీ స్థాపించి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైఎంహెచ్‌ఏలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ధర్మరక్షణకు నడుం బిగిస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మూడు రాష్ట్రాల బాధ్యులు కస్తూరి సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి గడ్డం నాగరాజు, సీనియర్ కార్యకర్త చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ జేఏసీ కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక



బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 25: స్థానిక రామచంద్రరావుపేటలోని మార్కండేయ వేద పాఠశాల వద్ద ఆదివారం ఏలూరు నగరంలోని వివిధ బ్రాహ్మణ శాఖలకు చెందిన ప్రతినిధులు సమావేశమై ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. నగరంలోని శ్రీ వైష్ణవ సేవా సంఘం, సావిత్రి భూదేవ సేవా సంఘం, హేలాపురి ఆర్ష సేవా సమితి, వైకానస సేవా సంఘం, ఏలూరు అర్చక సమాఖ్య, హేలాపురి బ్రాహ్మణ యువజన సంఘం, హేలాపురి సేవా సంఘం, బ్రాహ్మణ సంఘ సేవా సమైక్య, స్త్రీ శక్తి బ్రాహ్మణ మహిళా సంఘం ప్రతినిధులు చర్చించుకుని ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ ప్రక్రియకు సంఘ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షత వహించారు. నూతన అధ్యక్షులుగా కందుకూరి రవికుమార్‌శర్మ, కార్యదర్శిగా చాత్రాతి మదన్మోహన్, కోశాధికారిగా భోగరాజు శ్రీనివాస ఫణిప్రసాద్‌లను ఎంపిక చేశారు. కొంపల్లి తాయారు మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి సత్యవాడ దుర్గాప్రసాద్, మైలవరపు బాల సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు.

కళాకారులకు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



బకాయిలపై మాట్లాడుతున్న కళాకారులు

టి.నరసాపురం, ఆగస్టు 25: తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనకు భాషా సాంస్కృతికశాఖ సమాచార శాఖ కళాకారుల ద్వారా కళారూపాలు ప్రదర్శించిన కళాకారులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ఆర్ కృష్ణబాబు డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో షేక్ సుభాన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన జానపద కళాకారుల సంఘం సమావేశంలో కృష్ణబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బకాయిల చెల్లింపు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు మాట్లాడుతూ కళాకారులకు మరొక ఆర్థిక ప్రత్యామ్నాయం లేదని, బకాయిలు ఇప్పించి కుటుంబాలకు అన్నం పెట్టాలని ఆయన కోరారు. ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు తమ విజయం కోసం కళాకారులను ఉపయోగించుకుంటున్నారని, గెలిచినా, ఓడిన ఎన్నికల అనంతరం పాలకపక్షం, ప్రతిపక్షాలు సైతం కళాకారులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పెద్దలు మానవతా దృక్పథంతో ఆలోచించి కళాకారుల బకాయిలు చెల్లించాలని కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ రద్దు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 25: రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఏపీ రైతు సంఘం, సీపీఐ వ్యతిరేకిస్తున్నాయన్నారు. అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా విద్యుత్ మీటర్ల ప్రక్రియను వ్యతిరేకించిందన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల ప్రజల నడ్డి విరిచిందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా జగన్ సర్కార్ నిరంకుశంగా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దుచేయకుండా కొనసాగిస్తే ఆందోళన చేపడతామన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే రైతులు మరింత ఇబ్బందులు పడతారన్నారు. ప్రజల, రైతుల సంక్షేమం కోసం స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీలకు న్యాయం చేసేందుకు ఎస్సీ కమిషన్ కృషి

ఏలూరు రూరల్, ఆగస్టు 25: ఎస్సీలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ కృషిచేస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ అన్నారు. స్థానిక జడ్పీ అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ, అట్రాసిటీ చట్టం నేరాలను అడ్డుకోవడానికి కమిషన్ కృషి చేస్తుందన్నారు. ఎస్సీలపై దాడులు జరగకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పలువురు దళితసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. వట్లూరు గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థినులకు సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలను విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడానికి ఖర్చు చేస్తోందని, మంచి ఫలితాలను, అనుకున్న లక్ష్యాలను సాధించడం ద్వారా మంచి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

1850 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ఏలూరుసిటీ, ఆగస్టు 25: జిల్లాలో ఆదివారం మూడు బుకింగ్ సెంటర్ల ద్వారా రూ. 3.88 లక్షల విలువైన 1,850 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేసినట్లు మైనింగ్ శాఖ డీడీ రవికుమార్ తెలిపారు. మూడు బుకింగ్ సెంటర్లలో 94 ఆర్డర్లు నమోదు కాగా అన్నింటికీ సరఫరా జరిగిందన్నారు. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, చేబ్రోలు వద్ద రూ.538, వింజరం వద్ద టన్నుకు రూ.362కు ఇసుకను విక్రయదారులకు సరఫరా చేయటం జరిగిందన్నారు. పెండింగ్ లేకుండా బుకింగ్ మేరకు ఇసుక సరఫరా చేయటం జరిగిందని ఆయన తెలిపారు.

విద్యుల్లత..!





నగరంలో ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలను వివిధ తీగ మొక్కలు అల్లుకుపోయాయి. మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు చెట్టు కొమ్మల మధ్య చిక్కుకుపోయినట్లు కనిపిస్తున్నాయి. గాలి, వర్షం సమయంలో తీగలు, కొమ్మలు తగులుకుని నిప్పు రవ్వలు చిమ్ముతున్నాయి. షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయని, గాలి ఎక్కువగా ఉంటే ప్రమాదం జరుగుతుందని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్-ఏలూరు



చాణక్యపురి మూడో రోడ్డులో..






ఆర్‌ఎమ్‌ఎస్ పార్కు కాలనీ, శంకరమఠం ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో విద్యుత్ స్తంభాలపై చెట్ల కొమ్మలు



చేపల తూము రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని మూసేసిన చెట్టు కొమ్మలు



కలెక్టరేట్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్



గుండుగొలనులో బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్



ఐటీడీపీ ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి



దుగ్గిరాలలో ప్రజల ఫిర్యాదులను పరిశీలిస్తున్న ప్రభాకర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : చింతమనేని

పెదవేగి, ఆగస్టు 25: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలన దాడులు, దౌర్జన్యాలతో సాగిందని, నియోజకవర్గం మొత్తం అవినీతిమయంగా మారిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అవినీతికి తావులేని దిశగా పాలన సాగిస్తుందని చెప్పారు. అవినీతి, అక్రమాలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని, అది అధికారులైనా, నాయకులైనా ఉపేక్షించబోమని ప్రభాకర్ హెచ్చరించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు, మంచినేని శ్రీనివాసరావు, పెదర్ల నానీ, సైదు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని సోషల్ మీడియా ప్రతినిధులకు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి విజయానికి ఐటీడీపీ యాప్ ద్వారా కృషి చేసిన ప్రతినిధులకు ఎమ్మెల్యే చంటి ప్రసంశా పత్రాలు ఆదివారం అందజేశారు. సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా ప్రతినిధులు చేసిన కృషిని కొనియాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మీడియా ప్రతినిధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టీడీపీ నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, మహిళా అధ్యక్షురాలు తవ్వా అరుణకుమారి పాల్గొన్నారు.

కొప్పుల వెలమ సంఘం సత్కారం

● ఏలూరు రూరల్: ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కొప్పుల వెలమ సంఘం అధ్యక్షుడు భీమవరపు పాపారావు అధ్యక్షతన ఎమ్మెల్యే చంటిని సత్కరించారు. మాజీ మంత్రి మరడాని రంగారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. కొప్పుల వెలమ సంఘీయుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. కార్యదర్శి మరడాని అచ్యుతరావు, పడాల వెంకటేశ్వరరావు, ఆర్నేపల్లి తిరుపతి, మరడాని చందు, మూడేళ్ళ రంగారావు, లచ్చిరెడ్డి గోవిందు, బళ్ళా శివ, కార్పొరేటర్ హేమసుందరి పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపీ

భీమడోలు: గోదావరి కాల్వపై గుండుగొలను వంతెన పనులను వేగవంతం చేయాలని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ అధికారులకు సూచించారు. పనులు ఆలస్యమవుతున్నాయన్న సమాచారం మేరకు ఆయన పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ జాతర సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు. సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత, రాజారావు, సీనియర్ నాయకులు పొత్తూరి నరసింహరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నారాయణపురంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ బాధ్యత తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేశ్‌కు సర్పంచ్ దిడ్ల అలకనంద విజ్ఞప్తి చేశారు.

● ఉంగుటూరు: క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరం పీవీజీ.రాజు కళ్యాణ మండపంలో విశిష్ట వ్యక్తులకు సత్కారం జరిగింది. ఇందులో భాగంగా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు పాల్గొన్నారు.

కైకరంలో రంగమ్మ చెరువు ఆక్రమణల తొలగింపు



చెరువు తూర్పు వైపు ఆక్రమణ

ఉంగుటూరు, ఆగస్టు 25: కైకరం తూర్పు వీధి చెర్వు కట్టపై ఆక్రమణలను అధికారుల తొలగించారు. ఆక్రమణలపై ఆదివారం రగడ జరగడంతో వైసీపీ నాయకులు కొందరిని రెచ్చగొట్టారు. పలువురు చేబ్రోలు పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో కార్యదర్శి నాగేంద్ర, సర్పంచ్ సలగాల గోపి చెరువు స్థలంలో ఇనుప గొట్టాలు తొలగించారు. ఒకరికొకరు దుర్భాషలాడుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆక్రమణలు తొలగించారు. చెర్వు గట్టుపై రెండు షెడ్లు వేయడంతో రేపటిలోగా వాటిని పూర్తిగా తొలగించాలని కార్యదర్శి నోటీసు ఇచ్చారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఇస్కాన్ భగవద్గీత పాఠశాల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి నిర్వహించారు. రాధాకృష్ణులు, బాలగోపాలునికి మహాభిషేకం, నక్షత్ర హారతులు ఇచ్చారు. సత్యగోపీనాథ్ గురూజీ భగవంతుని దివ్యలీలపై ప్రవచన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గోకుల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం వైష్ణవ కృష్ణాష్టమి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈవో మానికల రాంబాబు ఆదివారం తెలిపారు. సాయంత్రం సామూహిక శ్రీకృష్ణ అష్టోత్తర అర్చన, ఉట్టి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పెదవేగి, ఆగస్టు 25: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, పుస్తక పఠనం చేశారు. గ్రంథపఠనంతో కలిగే లాభాలను అరుణ్‌కుమార్ వివరించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, ఆగస్టు 25: జెన్‌టెక్ ఎంఎస్‌ఈ కంపెనీల్లో ఉద్యోగాలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఘంటా సుధాకర్ ఆదివారం తెలిపారు. జెన్‌టెక్ ఎంఎస్‌సీ కంపెనీ కంటెంట్ మోడరేషన్ కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1500 ఖాళీల భర్తీ చేయనుందన్నారు. బీటెక్, ఏదైనా డిగ్రీ 2022-23, 24 సంవత్సరాల్లో పాసైన అభ్యర్థులు అర్హులు అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28లోగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి 9666322032 నెంబర్‌లో సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

వైసీపీ బొమ్మలు మూశారు : ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలవరం ఆగస్టు 25: మండల పరిషత్ బోర్డులపై మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఫోటోలపై అధికారులు తెల్లరంగు పూశారు. మూడు నెలలు కావస్తున్నా వైసీపీ బొమ్మలే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద యడ్లగూడెం, దేవరగొంది, పోలవరం ఆటోస్టాండ్, ప్రాజెక్టు చెక్ పోస్టు ప్రాంతాల్లో ఉన్న మండల పరిషత్ బోర్డులలో ఉన్న వైసీపీ బొమ్మలపై తెల్లరంగు పూసి కనిపించకుండా చర్యలు తీసుకున్నారు.

వైఎస్ విగ్రహం దిమ్మ పగలగొట్టాడని వివాదం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 25: తిరుమలాపురం పరిధిలోని కృష్ణంపాలెంలో జాలాది రాజు తన ఇంటి మెట్లకు అడ్డు వచ్చిన వైఎస్సార్ విగ్రహం సిమెంటు దిమ్మ పగలగొట్టాడు. గ్రామస్తులు, వైసీపీ నాయకులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆదివారం స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వీఆర్వో దుర్గారావు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. మెట్ల నిర్మాణానికి అడ్డు రావడంతో మరో దిమ్మ కట్టించే ఉద్దేశ్యంతో పగలగొట్టానని రాజు చెప్పడంతో వివాదం సద్దుమణిగిందని వీఆర్వో దుర్గారావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగపాలెం, ఆగస్టు 25: మండలం కలరాయునిగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడిచేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.వెంకన్న తెలిపారు. వారి నుంచి రూ.20,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసునమోదు చేసి నట్లు ఆయన తెలిపారు.

పలుచోట్ల విధుల్లో చేరిన ఎస్ఐలు

ఏలూరు క్రైం, ఆగస్టు 25: జిల్లాలో పలుచోట్ల బదిలీపై వచ్చిన అధికారులు ఆదివారం విధుల్లో చేరారు. ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐగా షేక్ మదీనా బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

● కామవరపుకోట: తడికలపూడి ఎస్ఐగా పి.చెన్నారావు బాధ్యతలు చేపట్టారు. రాత్రివేళల్లో గస్తీ పెంచుతామని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని తెలిపారు.

● బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఎస్సైగా డి.దుర్గామహేశ్వరావు ఆదివారం బాధ్యతలు స్వీకించారు. టి.నరసాపురం మండలంలో పనిచేస్తూ బదిలీపై ఆయన బుట్టాయగూడెం స్టేషన్‌కు వచ్చారు.

● జీలుగుమిల్లి: జీలుగుమిల్లి ఎస్సైగా పి.నవీన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వి.చంద్రశేఖర్ కొయ్యలగూడెం బదిలీ అయ్యారు.

● లింగపాలెం: ధర్మాజిగూడెం ఎస్సైగా కె.వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. బుట్టాయిగూడెం మండలం నుండి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతల విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తామన్నారు.

దళిత యువకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

టి.నరసాపురం, ఆగస్టు 25: బందంచర్లలో దళిత యువకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. బందంచర్లలో ఆదివారం దళిత సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈనెల 21న ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బంద్‌కు సహకరించాలని కోరిన యువకుడు పవన్‌పై హోటల్ యజమాని దివాకర్ దాడిచేసి గాయపరిచాడన్నారు. బాధితులకు అండగా నిలబడాల్సిన పోలీసులు బాధితులపైనే కేసులు బనాయించడం దారుణమన్నారు. కేసులు ఉపసంహరించకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామన్నారు. సమావేశంలో కల్వకుర్తి నాగేశ్వరరావు, లంకపల్లి భాను, పొర్లపాటు బాబు, మద్ద ఆనంద్, దారా పేర్రాజు, జయపాల్, మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం పీఠం పరిధిలో ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవలు

దెందులూరు, ఆగస్టు 25: ఏలూరు ఆర్‌సీఎం పీఠం పరిధిలో ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవలతో ముందుకు వెళ్లడం విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిందని సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బిఈడీ కాలేజీ కరస్పాండెట్ డాక్టర్ పాదర్ బాల అన్నారు. కళాశాల ఏర్పాటుచేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తొలి కరస్పాండెంట్ చార్లెస్, ఫాదర్ ఇమ్మనియాల్, మైఖైల్, సిస్టర్ సునీత ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఇదే కాలేజీలో చదువుకుని ఇదే కాలేజీకి ఉపాధ్యాయులుగా వచ్చిన వారిని ఫాదర్లు అభినందించారు. పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు

ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు ఆధ్వర్యంలో సోమవారం సెయింట్ జాన్స్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నామని కాలేజీ కరస్పాండెంట్ పాదర్ డాక్టర్ బాల తెలిపారు. దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకర్ పాల్గొంటారన్నారు. ఫాదర్ పొలిమేర జయరావు జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని పాదర్ బాల తెలిపారు



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



రాట్నాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, ఆగస్టు 25: అటవీ ప్రాంతంలో వన దేవత గుబ్బల మంగమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. వాతావరణం పొడిగా ఉండడం, కొండవాగుల ఇబ్బందులు లేకపోవడంతో భక్తుల సంఖ్య పెరిగింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చర్యలు చేపట్టారు. ఆలయం వద్ద అహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో భక్తులు అమ్మవారిని కనులారా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.33,560, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.16,500, ఫోటో విక్రయాల ద్వారా రూ.2వేలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.5647 విరాళాలు అందించారని ఆయన తెలిపారు.

ఘనంగా బీరయ్య దేవుని గ్రామోత్సవం

పెదపాడు: కొత్తూరులో బీరయ్య దేవుని గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీరయ్య దేవుని గుడిని, స్వామివారిని విశేషాలంకరణ చేసి గ్రామస్తులు, మహిళలు పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను తీన్‌మార్ డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణ నడుమ ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్: ప్రజలందరిపై గంగానమ్మ కరుణా కటాక్షాలు ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. సుంకరవారితోటలో గంగానమ్మ పోతురాజు జాతర వైభవంగా నిర్వహించారు. విచిత్ర వేషధారణ, డప్పు వాయిద్యాల నడుమ సంబరాలు జరిగాయి. ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చల్లా వెంకట సత్య వరప్రసాదరావు, పూజారి నిరంజన్, కొట్టు మనోజ్, చిన్నిఅర్జున్, నాగరాజు, ఎన్.రమేష్, సూరిబాబు, కార్పొరేటర్లు ఎస్ఎంఆర్.పెదబాబు, సుంకర చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకించడం దుర్మార్గమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీలుగా వర్గీకరిస్తే సమన్యాయం జరుగుతుందన్నారు.
- **ఉంగుటూరు :** మండలంలోని కైకరం గ్రామానికి చెందిన రిషిత్ మణిరామ్ వైద్యం నిమిత్తం మానవత అండగా నిలవనుంది. మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడపా శ్రీనివాసరావు, గంజి రవి, తదితరులు తీర్మానించారు.
- ఉంగుటూరు పాతూరి కల్యాణ మండపంలో డాక్టర ● పాతూరి విష్ణురావు సౌజన్యంతో మధుమేహ బాధిత చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. ఇన్సులిన్, మందులు, టెస్ట్ కిట్ అందజేశారు.
- **జంగారెడ్డిగూడెం :** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పారిశుధ్య విభాగ పట్టణ అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వరరావు తల్లి సుబ్బమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేశ్, పట్టణ గౌరవ అధ్యక్షుడు జెవి.రమణరాజు కొత్తూరి నాగేశ్వరరావు సుబ్బమ్మ పార్థివ దేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మధ్యంతర భృతి ప్రకటించాలి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి
- బహుళ సంఘాల్లో సభ్యత్వాలను ప్రభుత్వమే రద్దు చేయాలి
- జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల డిమాండ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 25 : ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణమే మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రభుత్వం ప్రకటించాలని ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏలూరులో జేఏసీ, ఏపీ రెవెన్యూ సర్వీసుల అసోసియేషన్ల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం జరిగాయి. ఈ రెండు కార్యవర్గ సమావేశాలకు రాష్ట్రంలోని 26 జిల్లాల జేఏసీ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులు డిమాండ్ చేయాల్సిన పరిస్థితులు రాకుండానే ఎనిమిది అంశాల్లో సానుకూల నిర్ణయాలను ప్రకటించి, అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వేతన సవరణపై గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టకుండానే రాజీనామా చేసినందున, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కమిషనర్‌ను నియమించి నిర్ణీత కాల వ్యవధిలోగా నివేదికను రప్పించుకుని నూతన పీఆర్సీని అమలుచేసేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.

వాస్తవానికి గతేడాది జూలై ఒకటి నుంచే 12వ పీఆర్సీ వేతన స్కేళ్ళు, జూన్ ఒకటి నుంచి ఐఆర్ అమలుకావాల్సి ఉందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పెన్షనర్లకు చెల్లిస్తున్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ శ్లాబులను గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా తగ్గించి వేసిందని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే పాత శ్లాబుల ప్రకారం పెన్షనర్లకు అదనపు పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి కేవలం వైద్య ఆరోగ్య శాఖలో కొందరికే పరిమితం చేసిందని, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న విద్యాశాఖ వంటి కీలకమైన శాఖలకు కూడా క్రమబద్ధీకరణను వర్తింప జేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తొలగించిన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం వర్తింప జేయాలన్నారు.

బహుళ సంఘాల్లో సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఒక ఉద్యోగి ఒక సంఘంలో మాత్రమే సభ్యత్వం కలిగి ఉండేలా 'రోసా' నియమనిబంధనల్లో మార్పులు చేసి, బహుళ సభ్యత్వాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆయా శాఖల్లో సమస్యలపై పూర్తి అవగాహనతో వ్యవహరించే డిపార్ట్‌మెంట్ సంఘాల నిర్ణయాలకు ఇతర సంఘాలు భిన్నంగా వ్యవహరించే వీలుందని, ముఖ్యం గా కామన్ కేడర్ సంఘాల జోక్యం వల్ల ప్రధానమైన అంశాల్లో అనవసర మైన భిన్నాభిప్రాయాలకు దారితీసే అవకాశముందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం, ఇటీవల రూపాంతరం చెంది కొత్త ఏపీ ఎన్జీవోలుగా మార్చుకుని అన్ని శాఖల్లో గెజిటెడ్ అధికారులకు కూడా సభ్యత్వం తీసుకోమని ఎన్జీవోలు గెజిటెడ్ అధికారులను కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ఏపీజేఏసీ-అమరావతి అనుబంధ సంఘాల్లో సభ్యత్వం ఉన్న సభ్యులెవరూ ఏపీఎన్జీవో, ఏపీజీఈఏ లాంటి కామన్ కేటగిరీ లేదా ఇతర ఏ సంఘాల సభ్యత్వాన్ని తీసుకోరాదని రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానించామని వెల్లడించారు. అనంతరం జేఏసీ రాష్ట్ర కోశాధికారిగా పనిచేసిన మురళీకృష్ణ నాయుడు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనను సన్మానించారు. ఆయన స్థానంలో కొత్తగా సంఘ కోశాధికారిగా కనపర్తి సంగీతరావు, కో చైర్మన్లుగా జె.శ్రీనివాస రావు, డీజీ ప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శిగా కె.అంజనే యకుమార్‌లను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కో చైర్మన్లు రమణ, శాస్త్రి, శివానందరెడ్డి, కిషోర్‌కుమార్, స్టేట్ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ పి.లక్ష్మి, సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి, జిల్లా జేఏసీ చైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

చేపకు.. చేటు కాలం!

- వర్షాలతో చల్లబడుతున్న నీరు.. ఆక్సిజన్ కొరత
- ఖరీదైన మందులు వాడుతున్నా ఫలితం శూన్యం
- చేపల మృత్యువాతతో రూ. కోట్లు నష్టపోతున్న ఆక్వా రైతులు

చేపలకు గడ్డుకాలం ఎదురైంది. చేపల పెంకందార్లకు సాగులో ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపం ఏర్పడి చేపలు చనిపోతున్నాయి. చేపలకు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్న ప్రస్తుతం పరిస్థితుల్లో చేపలు చేతికి దక్కకుండానే చెరువుల్లోనే చనిపోతున్నాయి. కొంత మంది రైతులు చేపలను సైజు పెరగకుండానే పట్టి అమ్మేస్తున్నారు.



బొమ్మినంపాడులో చనిపోయిన చేపలు

కలిదిండి, ఆగస్టు 25 : వాతావరణంలో మార్పులతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. కలిదిండి మండలంలో 23 వేల ఎకరాల్లో రైతులు చేపల సాగు చేస్తున్నారు. సుమారు 700 ఎకరాల్లో ఆక్సిజన్ లోపించి చేపలు మృత్యువాత పడడంతో సుమారు రూ.7 కోట్లు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది సాగునీరు కొరతతో చెరువులకు నీరు తోడే అవకాశం లేకుండాపోయింది. చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో పసరు రంగుగా మారి చిక్కబడుతున్నాయి. దీంతో చేపలకు శంకు జలగ వ్యాధి సోకి ఉదయానికి మృత్యువాత పడి తేలియాడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆక్సిజన్ కొరత నివారణకు ఖరీదైన మందులు వాడుతున్నా ఫలితం లేదంటున్నారు. ఎకరానికి రూ.లక్షన్నర చొప్పున పెట్టుబడి పెట్టారు. హడావిడిగా చేపలను పట్టుబడి చేసి తరలిస్తే ఆకివీడు మార్కెట్‌లో కిలో చేప రూ.40కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని పెట్టుబడులు రాక అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు. పెదలంక, మూల్లంక, భాస్కర రావుపేట, మట్టగుంట, కొండంగి, సంతోషపురం గ్రామాల్లో చెరువుల్లో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చనిపోయిన చేపలు పాడైపోవడంతో గట్లపై గుట్టలుగా వేస్తున్నారు.

పెదలంకకు చెందిన ఓ రైతుకు చెందిన 30 ఎకరాల చెరువులో ఆక్సిజన్ కొరత ఏర్పడి చేపలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. మట్టగుంటకు చెందిన మరో రైతుకు చెందిన 15 ఎకరాల చెరువులో ఉప్పు శాతం పెరగడంతో చేపలు చనిపోయాయి. భాస్కర రావుపేటకు చెందిన రైతు చెరువులోని చేపలకు శంకు జలగ వ్యాధి సోకి చనిపోతు న్నాయి. రైతులు చేపల చెరువుల వద్దే రేయింబవళ్లు కాపలా కాస్తూ మందులు చల్లుతున్నా ఫలితం ఉండడం లేదు. ఇదే విధంగా మరో వారం రోజులపాటు వర్షాలు కురవడం, మరోవైపు విద్యుత్ కోత విధిస్తే చేపల చెరువులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి చేపల చెరువులకూ సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



అంతా నష్టమే..

రొయ్యల సాగు కలసి రావటం లేదని చేపల సాగు చేపట్టినా ఆక్వా రైతుకు నష్టం తప్పటం లేదు. వాతావరణం అనుకూ లించక చేపలు ఆక్సిజన్ లోపంతో చనిపోతున్నాయి. దీంతో అప్పుల పాలవుతున్నాం.

-రెడ్డి నాగరాజు, ఆక్వా రైతు, శ్రీహరిపురం



మట్టగుంటలో చనిపోయిన చేపలను గుట్టలుగా వేస్తున్న రైతులు

ముదినేపల్లి: మండలంలో 10 వేల ఎకరాల్లో చేపలు సాగవుతున్నాయి. సుమారు 2 వేల ఎకరాల్లో చేపలు చనిపోయి రైతులు రూ. 15 కోట్ల పెట్టుబడిని నష్టపోయారు. బొచ్చె, శీలావతి, కట్ల రకం చేపలు చనిపోయి నీటిపై తేలుతుంటే చూస్తూ ఊరుకోవటం తప్ప రైతులు చేసేదేమీ కనిపించటం లేదు. వర్షం కురవటం, మరి కాసేపట్లో ఎండలు కాయటం లాంటి పరిస్థితుల్లో చెరువుల్లో ఆక్సిజన్ విపరీతంగా లోపిస్తున్నది. దీంతో రైతులు చిన్న సైజు చేపలను పట్టేసి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. పెట్టుబడి కూడ దక్కని పరిస్థితి ఏర్పడింది.

40 వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ

- వేల్పుచర్లలో శనివారం రాత్రి ఘటన
- చోరీల నియంత్రణలో పోలీసుల విఫలం
- ఉన్నతాధికారులైనా పట్టించుకోవాలని బాధితుల విజ్ఞప్తి

ముసునూరు, ఆగస్టు 25: మండలంలో వ్యవసాయ బోర్లకు సంబంధించిన సామగ్రి చోరీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా వేల్పుచర్ల గ్రామంలో శనివారం రాత్రి సుమారు 40 వ్యవసాయ బోర్లకు సంబంధించిన కేబుల్‌తో పాటు స్టార్టర్, ఫీజుల్లో రాగివైరును సైతం దొంగిలించుకుపోయారు. బాధిత రైతులు ఉదయం పంట పొలాల్లోకి వెళ్ళగా వ్యవసాయ బోర్లు సామాగ్రి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కొక్క బోరుకు సంబంధించిన సామగ్రి సుమారు 10 వేల నుంచి రూ.15 వేలు ఉంటుందని రైతులు తుమ్మల నాగేశ్వరరావు, మానం వంశీకృష్ణ, అబ్బినేని రంగారావు, కోవెలమూడి ఉదయ్‌భాస్కర్‌రావు, ఇల్లూరి సోములు తదితరులు వాపోయారు. ఇటీవల ముసునూరు, పెదపాటివారిగూడెం, గోపవరం, సూరేపల్లి, చింతలవల్లి తదితర గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీలు జరగ్గా, రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా నేటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని, ఈ చోరీలను నియంత్రించాల్సిన పోలీసులు పట్టనట్లుగా వ్యవహరించటం వల్లే చిల్లర దొంగలు పెట్రేగిపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టి చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వేల్పుచర్లలో వ్యవసాయ బోరు కేబుల్‌ను చోరీ చేసిన దృశ్యం



ఫ్యూజుల్లో రాగివైర్లను చోరీ చేసిన దుండగులు



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎమ్అండ్‌హెచ్‌వో

పీహెచ్‌సీని తనిఖీచేసిన డీఎంఅండ్‌హెచ్‌వో

నూజివీడు టౌన్, ఆగస్టు 25: గొల్లపల్లి పీహెచ్‌సీని ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్యం, ఆస్పత్రిలో ప్రసవాలపై ఆరా తీశారు. అలాగే గర్భిణులకు అందించవలసిన సేవలపై పలు సూచనలు చేశారు. వైద్యాధికారి పి.శ్రీనివాస్ గౌతమ్, డాక్టర్ నజ్మా, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎఫ్‌ఎల్‌లను మినహాయించాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 25: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ఎల్‌ఎఫ్‌ఎల్ పోస్టులను పరిగణలోకి తీసుకోకుండా ప్రాథమిక పాఠశాలలోని ఎస్జీటీ సర్‌ప్లస్ టీచర్లను లెక్కించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సత్యం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. గత ప్రభుత్వం పాఠశాల రోల్‌తో సంబంధం లేకుండా ఎల్‌ఎఫ్‌ఎల్ పోస్టులు కేటాయించిందని ప్రస్తుతం జరుగుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో సర్‌ప్లస్‌ను గుర్తించే క్రమంలో ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు బయటకు రావడం జరిగిందని, దీని వల్ల కొన్నిచోట్ల 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 90 లోపు విద్యార్థులకు ఇద్దరు లేదా ముగ్గురు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సర్‌ప్లస్ ఎస్జీటీలను గుర్తించే క్రమంలో ఎల్‌ఎఫ్‌ఎల్‌లను మినహాయించాలని కోరారు.

కైకలూరు రూరల్ ఎస్సైగా రాంబాబు



కైకలూరు, ఆగస్టు 25: కైకలూరు రూరల్ ఎస్సైగా వి. రాంబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరు రూరల్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన టి. రామకృష్ణ తూర్పు గోదావరిజిల్లా తుని డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టడంతో టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, ప్రధాన కార్యదర్శి పి రాధాకృష్ణ, మైనార్టీ నాయకుడు ఎండీ ఉస్మాన్, బాజానీ, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పడమటి వాసు తదితరులు ఎస్‌ఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముసునూరు ఎస్‌ఐ వాసు బదిలీ

ముసునూరు, ఆగస్టు 25: ముసునూరు మండల ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.వాసు కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండల ఎస్‌ఐగా ఆదివారం బదిలీపై వెళ్ళారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడ రూరల్ నుంచి ముసునూరు ఎస్‌ఐగా ఆయన ఇక్కడకు వచ్చారు. మండలంలో ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. ఉన్నతాధికారులు ఎస్‌ఐ వాసును బదిలీ చేశారు. ఏఎస్‌ఐ నాగభూషణరావు, హెడ్‌కానిస్టేబుల్స్ అజయ్‌బాబు, విజయ్‌కుమార్ తదితరులు ఎస్‌ఐ వాసును ఘనంగా సన్మానించారు. ముసునూరుకు నూతన ఎస్‌ఐ రెండురోజుల్లో రానున్నట్లు సమాచారం.

బద్లాపూర్ ఘటన అమానుషం

చాట్రాయి, ఆగస్టు 25: మహారాష్ట్రలోని బద్లాపూర్ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై అటెండర్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన అమానుషమని సీపీఐ(ఎంయల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోల్‌కత్తా, మహారాష్ట్ర ఘటనలు జరిగిన వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించటంలో, కేసులు రిజిష్టర్ చేయటంలో పోలీస్, అధికార యంత్రాగం నిర్లక్ష్యంగా వ్యవహరించటం దారుణమన్నారు. పాఠశాలలు, పని ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చెక్కపల్లిలో డ్రెయినేజీల్లో పూడికతీత



ముసునూరు, ఆగస్టు 25: చెక్కపల్లి పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ తల్లి బోయిన రాధికా సత్యనారాయణ అన్నారు. ఆదివారం గ్రామంలో ప్రధాన, అంతర్గత రహదారులకిరువైపులా ఉన్న డ్రెయినేజీల్లో పూడికతీతను ఎక్స్‌వేటర్‌తో చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో అన్ని కాలనీల్లో డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రణాళిక బద్ధంగా పూర్తిచేస్తామని సర్పంచ్ తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్పంచ్ భర్త సత్యనారాయణ పనులను పర్యవేక్షించారు.

ఘాట్ రోడ్డు వేయిస్తా : రామకోటయ్య



ఆగిరిపల్లి, ఆగస్టు 25:ఇచ్చిన మాటకు వెనకాడే ప్రసక్తేలేదని నూజివీడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య అన్నారు. తాను 2024 ఎలక్షన్ సమయంలో ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారి కొండపైకి దుర్గా మల్లేశ్వరస్వామి వారి సన్నిధి వరకు ఘాట్‌రోడ్డు వేయిస్తానన్న మాట మరువలేదని ఎంత ఖర్చయినా తానే భరిస్తానని అన్నారు. ఈ విషయమై ఆలయ కార్యదర్శికి లేఖ రాస్తానని, ఆగిరిపల్లి ప్రజల ఆప్యాయతలు మరువనని, వారికి రుణపడి ఉంటానని తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన రామకోటయ్య ఈ విధంగా తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషబాబు, రామకోటయ్యని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.



68వ రోజు అన్నక్యాంటీన్

కైకలూరు ఆగస్టు 25: కైకలూరులో అన్నక్యాంటీన్ వద్ద 68వ రోజు అద్దంకి అన్నపూర్ణ జ్ఞాపకార్థం వారి కుమారులు అద్దంకి శ్రీనివాసరావు, శివనాగేశ్వరరావు పేదలకు ఉచితంగా భోజనాన్ని పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ప్రారంభించి మాట్లాడుతూ డొక్కా సీతమ్మను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నడుపుతోందన్నారు. కూటమి నాయకులు బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, పుప్పాల సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి ఆర్థిక సాయం



ముదినేపల్లి, ఆగస్టు 25 : తల్లిదండ్రులను కోల్పోయి నానమ్మ సంరక్షణలో ఉండి చదువుకుంటున్న గుడివాడకు చెందిన అక్కచెల్లెళ్లు పిరిడె ప్రవల్లిక, తేజస్వినిలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసింది. ఆదివారం వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలసి గుడివాడలోని వారి ఇంటికి వెళ్లి అక్కచెల్లెళ్లను పరామర్శించి సహాయం అందజేశారు.

రూ. 25 వేలతో సిమెంట్ బల్లల వితరణ

ముసునూరు, ఆగస్టు 25: ముసునూరుకు చెందిన టీడీపీ యువనేత పాకనాటి సీతారామ్ తన తాతయ్య లక్ష్మయ్య, నాయనమ్మ చంద్రమ్మల జ్ఞాపకార్థం ప్రజల సౌకర్యార్థం ఆదివారం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. సుమారు రూ. 25 వేల విలువ గల ఆరు సిమెంట్ బల్లలను ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేశారు.

బీజేపీ సభ్యత్వ ఇన్‌చార్జ్‌గా రాధిక

ముదినేపల్లి, ఆగస్టు 25 : బీజేపీ సంస్థాగత కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పార్టీ సభ్యత్వాల నమోదుకు ముదినేపల్లి మండలం సభ్యత్వ ప్రముఖ్ (ఇంచార్జ్)గా అల్లూరుకు చెందిన పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి రెడ్డి రాధికను నియమించారు. మండలంలో కో- ప్రముఖ్‌లుగా కొల్లిపర నాగరాజు, నీలం మల్లేశ్వరరావులను పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ నియమించారు. వీరు మండలంలో పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదుకు బాధ్యులుగా వ్యవహరిస్తారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం



ఆగిరిపల్లి, ఆగస్టు 25: ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో సెంటిని హాస్పిటల్స్ విజయవాడ సౌజన్యంతో జరిగింది. ప్రముఖ గుండె వైద్యులు కాగిత కృష్ణచంద్ వెన్నుముక, నరాల వైద్య నిపుణుడు కాగిత రాకేష్ సుమారు 200 మంది రోగులను పరీక్షించి తగు సూచనలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. సంఘ వ్యవస్థాపక జాతీయ చైర్మన్ కాసుల కోనయ్య, జిల్లా చైర్మన్ నంజం రామకృష్ణ పర్యవేక్షించారు.

ముమ్మరంగా డెక్క తొలగింపు పనులు



ముదినేపల్లి, ఆగస్టు 25 : మండలంలోని మేజర్, మీడియం డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. పనులకు ప్రభుత్వం సుమారు రూ. 60 లక్షల నిధులు మంజూరు చేయటంతో అధికారులు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. పోల్‌రాజ్, పెదలంక మేజర్ డ్రెయిన్లతోపాటు అన్నవరం మీడియం ఇతర డ్రెయిన్లలో డెక్కను తొలగిస్తున్నారు. పోల్ రాజ్ డ్రెయిన్‌లో రూ.18 లక్షలు, పెదలంక మేజర్ డ్రెయిన్‌తో పాటు ఇతర మీడియం డ్రెయిన్లలో రూ.30 లక్షల వ్యయంతో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్టు డ్రెయినేజీ శాఖ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్ తెలిపారు.

మానవత సేవలు అభినందనీయం



గ్రంథాన్ని అందజేస్తున్న దృశ్యం

కైకలూరు ఆగస్టు 25: మానవత సేవలు అభినందనీయమని సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకట నారాయణ అన్నారు. ఆదివారం కైకలూరు శ్రీరామకృష్ణ సేవా సమితిలో జన విజ్ఞాన వేదిక సమావేశాన్ని నిర్వహించారు. జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ బి. బ్రహ్మారెడ్డి రచించిన ప్రజల ఆరోగ్యం... ప్రజల చేతుల్లోకి గ్రంథాన్ని మానవత సేవా సంస్థ అధ్యక్షులు కొండ్రెడ్డి చిట్టెమ్మ, మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణకు అందజేశారు. మానవత సభ్యులు మాడెం వీర వెంకట సత్యనారాయణ, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, నారగాని సత్యనారాయణ, రుద్రపాక రత్నారావు, పటాకుల వెంకటేశ్వరరావు, గంగుల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం



పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు సీజ్

ముసునూరు, ఆగస్టు 25: మండలంలోని లోపూడిలో తమ్మిలేరు నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం ఉదయం ముసునూరు పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన పోలుబోయిన దుర్గారావు, పేరం వెంకటేశ్వరరావులు తమ ట్రాక్టర్లతో అనుమతులు లేకుండా తమ్మిలేరు నుంచి ఇసుకను లోడ్ చేసుకుని చెక్కపల్లివైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌బాబు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



ముసునూరులో గంగానమ్మకు భక్తుల పూజలు



ముదినేపల్లిలో నైవేద్యాల సమర్పణ



కోరుకొల్లులో బళ్లమ్మవారు



వెలంపేటలో గంగానమ్మ సంబరంలో యువత కేరింతలు

వైభవంగా జాతరలు

ముసునూరు, ఆగస్టు 25: ముసునూరులో గంగానమ్మ జాతరను ఆదివారం వైభవంగా జరిగింది. మహిళలు అమ్మవారికి 101 బిందెలతో జలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం దేవరచెరువు గట్టుపై ఉన్న జలగంగమ్మ వారికి 101 బిందెలతో జలాభిషేకాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి జాతరను మేళతాళాలతో చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గ్రామ ప్రముఖులు దేవినేని వరప్రసాదరావు దంపతులు, రేగుల చంద్రశేఖర్ రావు దంపతులు, గ్రామపెద్దలు మానికల అచ్చియ్య, తలకొండ సాంబశివరావు, సత్యనారాయణ, పాకనాటి వెంకటేశ్వరరావు తదితరులు సౌకర్యాలు పర్యవేక్షించారు. పాప్‌కార్న్ కంపెనీ యాజమాన్యం భక్తులకు అన్నదానం చేసింది.

ముదినేపల్లి: శ్రీహరిపురంలో గంగానమ్మ జాతర ఆదివారం కోలాహలంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాతూరి మల్లికార్జునరావు, నల్లమోతు మోహనరావు, చీదెళ్ల సుబ్రహ్మణ్యం, నీలం శివ రమేష్ తదితరుల ఆధ్వర్యంలో గ్రామస్థులు ఊరేగింపుగా వచ్చి ఆలయం వద్ద అమ్మవారికి పూజలు జరిపారు.

కైకలూరు: వెలంపేటలో గంగానమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ఇంటింటికి తీసుకువెళ్లారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించగా మహిళలు ఇంటింటా అమ్మవారికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. తీన్మార్ డప్పు వాయిద్యాల నడుమ యువత సంబరాలను నిర్వహించారు.

కలిదిండి: కోరుకొల్లులో బళ్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారిని మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. వేడి నైవేద్యాలు సమర్పించారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, కూటమి నాయకులు చెన్నంశెట్టి మురళీకృష్ణ, వలవల రమాదేవి, నున్న సుబ్రహ్మణ్యం, వట్టూరి శ్రీనివాస్, ఆమజాల బాబులు, ఎంపీటీసీ రమాదేవి, కేశిరెడ్డి బలరామ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పవిత్రాల సమర్పణ



ముదినేపల్లి: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు పట్టు పవిత్రాలను సమర్పించి వేదపండితులు పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హోమాలను అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షణలో అర్చకులు గూడూరు రామకృష్ణ శర్మ, తోలేటి వీరభద్ర శర్మ నిర్వహించారు.